




మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

PRGI: APTEL/26/A2367

జాతీయ తెలుగు దినపత్రిక

www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 1 | సంచిక : 90 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 24 మే 2026 | వెల : 2-00


# వైకాపా మళ్లీ రావద్దు



- వైకాపా గొడ్డలి పార్టీ.. సమాజానికి హానికరం
- తల్లికి అన్నం పెట్టని వ్యక్తి పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా?
- జగన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలు
- చిత్తూరు జిల్లా యాదమరిలో పర్యటన
- ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు చేస్తామని వెల్లడి

**చిత్తూరు/అమరావతి, స్వర్ణసాగరం**

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైకాపా గొడ్డలి పార్టీయేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని, ఆ పార్టీ 'నెవర్ ఎగైన్' అనే నినాదాన్ని ప్రజలంతా వినిపించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ప్రజల్ని కోరారు. రాష్ట్రంలో జనాలను కాపాడే రాజకీయాలు ఒకవైపు ఉంటే, భయపెట్టి మోసం చేసే రాజకీయాలు మరోవైపు ఉన్నాయని పేర్కొన్నారు. శనివారం చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించడానికి వచ్చిన చంద్రబాబు 14.కండ్రిగ గ్రామంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'సూపర్ సిక్స్‌ను సూపర్‌హిట్ చేస్తే గొడ్డలి పార్టీ తట్టుకోలేకపోతోంది. నోరు - మిగతా3లో



చంద్రబాబుపై ఎమ్మెల్యే శ్రీధర్ విమర్శలు

# వెంటనే చర్యలు తీసుకున్న పవన్

- పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేసి మోసం చేశాడంటూ ఐదారు నెలలుగా ఓ మహిళా ఉద్యోగిని ఆవేదన
- రెండ్రోజుల కిందట ఒక వర్గం మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వీడియో వైరల్
- అయినా కనీస చర్యలు తీసుకోని పవన్
- తాజాగా సీఎం చంద్రబాబు వేస్ట్ అంటూ శ్రీధర్ మాట్లాడిన మరో వీడియో హల్‌చల్
- దీంతో ఆగమేఘాల మీద అరవ శ్రీధర్‌పై చర్యలు

2

# మరోసారి పెట్రో ధరల పెంపు



- పెట్రోలుపై 87, డీజిల్‌పై 91 పైసలు పెరుగుదల
- సీఎన్జీ ధరను కూడా కిలోకు ఒక రూపాయి చొప్పున పెంచారు
- ఇది ఎనిమిది రోజుల్లో మూడు విడతల్లో కిలోకు రూ.4 పెరిగింది.

2

# అణచివేస్తున్నారు!

- సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేస్తున్నారు
- మా ఖాతాలను హ్యాకింగ్ చేస్తున్నారు
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆగ్రహం
- ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలు తమకు అందుబాటులో లేవని వెల్లడి

2




# కాంగ్రెస్‌లో రాజ్యసభ కలవరం



- పోటీలో ఖర్గే సహా పలువురు మాజీ ముఖ్యమంత్రులు
- కర్ణాటక నుంచి ఖర్గేకు అవకాశం ఖాయమంటూ ప్రచారం
- తెరపైకి కమల్‌నాథ్, పవన్‌ఖేరా, అశోక్ గెహ్లోట్, భూపేశ్ బఘేల్ పేర్లు
- మాజీ ముఖ్యమంత్రుల్లో ఒకరికి దక్కనున్న అవకాశం



# భానుడి భగభగలు

- కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 95 మండలాల్లో 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- నేడు 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

**అమరావతి, స్వర్ణసాగరం**

రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. శనివారం రాష్ట్రంలోని 95 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు, - మిగతా3లో

# కలిసి పనిచేద్దాం!

- ప్రపంచ సౌభాగ్యం, శాంతి కోసం కృషి చేద్దాం
- ప్రధాని మోదీ, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నిర్ణయం
- నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న రూబియో
- ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయన్న మోదీ
- పశ్చిమాసియా పరిణామాలను వివరించిన రూబియో



**స్వర్ణసాగరం న్యూఢిల్లీ**

ప్రపంచ సౌభాగ్యం, శాంతి కోసం ఇకపైనా కలిసికట్టుగా పని చేయాలని భారత్, అమెరికా నిర్ణయించుకున్నాయి. ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ఢిల్లీలో మోదీతో సమావేశమయ్యారు. పశ్చిమాసియా పరిణామాలను మోదీకి వివరించారు. రక్షణ, వ్యూహాత్మక సాంకేతికతలు, వ్యాపారం, వాణిజ్యం, ఇంధన భద్రత వంటి కీలక రంగాల్లో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సహకారంపై వారిద్దరూ చర్చించుకున్నారు. రూబియో శనివారం ఢిల్లీకి చేరుకున్న కొద్దిసేపటికే మోదీతో భేటీ అయ్యారు. నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించబోతున్నారు. గత ఏడాది కాలం నుంచి ఒత్తిళ్ల ఎదుర్కొంటున్న ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను పునఃసమీక్షించే ప్రయత్నంగా రూబియో పర్యటనను నిపుణులు పరిగణిస్తున్నారు. రూబియోను కలవడం ఆనందంగా ఉందంటూ మోదీ - మిగతా3లో

# అణచివేస్తున్నారు!

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)పై అణచివేత చర్యలు కొనసాగుతున్నాయని పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. తమ సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేస్తున్నారని, హ్యాకింగ్ జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ పార్టీకి ప్రస్తుతం తమ సోషల్ మీడియా ఖాతాలేవీ అందుబాటులో లేవని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. తన వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా హ్యాక్ చేశారని విమర్శించారు. రెండు రోజుల క్రితం సీజేపీ 'ఎక్స్'ఖాతాను ప్రభుత్వం నిలిపివేసిన సంగతి తెలిసిందే. దాంతో ఆ పార్టీ కొత్త ఖాతాను సృష్టించుకుంది. నీట్(యూజీ)--2026 పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలంటూ సీజేపీ శుక్రవారం ఆన్‌లైన్‌లో ఉద్యమం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో తనకు బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణహాని ఉందని అభిజిత్ దీప్కే చెప్పారు. తమ పార్టీని పూర్తిగా అణచివేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని, తన వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ పేజీని హ్యాక్ చేశారని తెలిపారు. ట్విట్టర్ ఖాతాను నిలిపివేశారని, బ్యాకప్ ఖాతాను కూడా తొలగించారని వెల్లడించారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలేవీ తమకు అందుబాటులో లేవన్నారు. ఇకపై వచ్చే పోస్టులను కాక్రోచ్ జనతా పార్టీ నుంచి వచ్చిన అధికారిక ప్రకటనగా పరిగణించకూడదని కోరారు.

**ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకు కక్షగట్టారు**

సీజేపీ వెబ్‌సైట్ అయిన 'కాక్రోచ్‌జనతాపార్టీ.ఓఆర్‌జీ'ని కూడా ప్రభుత్వ వర్గాలు కక్షపూరితంగా తొలగించినట్లు అభిజిత్ దీప్కే తెలిపారు. అది ఇప్పుడు అందుబాటులో లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే తమ పార్టీపై యుద్ధం ప్రకటించారని అభిజిత్ దీప్కే మండిపడ్డారు. "ప్రభుత్వం మా ప్రతిష్టాత్మక వెబ్‌సైట్‌ను తొలగించింది. మా వెబ్‌సైట్‌లో కోటి మంది సభ్యులుగా చేరారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆరు లక్షల మంది సభ్యులు పిటిషన్‌పై సంతకం చేశారు"అని వివరించారు. ఎంతగా అణచివేస్తున్నా




తమ ఉద్యమం నానాటికీ విస్తరిస్తూనే ఉందని తేల్చిచెప్పారు. ఇండియాలో కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్'ఖాతాను నిలిపివేయడాన్ని డిజిటల్ హక్కుల సంఘం 'ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్'తప్పుపట్టింది. ఈ చర్యను ప్రభుత్వ అధికార దురి?వనియోగంగా అభివర్ణించింది.

**ఇదీ కాక్రోచ్ కథ**

ఉద్యోగాలు, ఉపాధి లేని యువత పరాన్నజీవులుగా, బొద్దింకల మాదిరిగా వ్యవస్థలపై దాడి చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ నెల 15న ఒక కేసు విచారణ సందర్భంగా మాట్లాడుతూ విమర్శించారు.

ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో సంబంధాలున్న అభిజిత్ దీప్కే అనే యువకుడు జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తంచేశాడు. ఈ నెల 16న 'వాయిస్ ఆఫ్‌లేజీ అండ్ అన్‌ఎంప్లాయ్‌డ్'అనే ట్యాగ్‌లైన్‌తో కాక్రోచ్ జనతా పార్టీని ఏర్పాటు చేశాడు. ఇదొక ఆన్‌లైన్ వ్యంగ్య పార్టీ. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. రాజ్యాంగాన్ని, ఐదు సూత్రాల మేనిఫెస్టోను ప్రకటించాడు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్‌లో పోరాటం సాగించడమే తన లక్ష్యమని స్పష్టంచేశాడు. ప్రధానంగా యువత ఈ పార్టీ పట్ల విపరీతంగా ఆకర్షితులయ్యారు.

కాక్రోచ్ జనతా పార్టీని ఇన్‌స్టాగ్రామ్‌లో అనుసరించేవారి సంఖ్య కోటికి చేరుకుంది. రెండు రోజుల వ్యవధిలోనే 40 వేల మంది ఆ పార్టీలో చేరారు.

నిరుద్యోగం, రాజకీయ జవాబుదారీతనం, ప్రశ్నపత్రాల లీకేజీలపై యువతలో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని సీజేపీ బహిర్గతం చేసింది. సీజేపీ వెబ్‌సైట్. ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. అధికార బీజేపీ సహా ప్రధాన జాతీయ రాజకీయ పార్టీల కంటే సీజేపీకి సోషల్ మీడియాలో అధికంగా ఆదరణ లభించింది. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీ కంటే సీజేపీని ఎక్కువ మంది అనుసరించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీని అనుసరించేవారి సంఖ్య 2 కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 22న సీజేపీ 'ఎక్స్'ఖాతాను నిలిపివేసింది.

# కాంగ్రెస్‌లో రాజ్యసభ కలవరం

స్వర్ణసాగరం న్యూఢిల్లీ:

త్వరలో రాజ్యసభలో ఖాళీ అయ్యే 24 స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడటంతో కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. రాజ్యసభలో చోటు దక్కించుకునేందుకు అవకాశమున్న కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్, జార్ఖండ్ రాష్ట్రాల్లో టిక్కెట్ల కేటాయింపుపై చర్చలు మొదలయ్యాయి. సీటు కోసం పలువురు మాజీ ముఖ్యమంత్రులు, సీనియర్ నేతల మధ్య పోటీ కన్పిస్తోంది. దీంతోపాటు, ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్ ప్రాంతంలోని టైప్--7 ప్రభుత్వ బంగ్లాను కాంగ్రెస్ పేరుతోనే కొనసాగించే వ్యూహం కూడా అధిష్టానం వద్ద ఉంది.

**కర్ణాటక నుంచి ఖర్గే బెర్త్ ఖరారు?**

కర్ణాటకలోని నాలుగు సీట్లకు ఎన్నికలు జరగనుండగా, ఇందులో కాంగ్రెస్‌కు కనీసం రెండింటి అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ రెండింటిలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు బెర్త్ దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. మరో సీటు లింగాయత్ సామాజిక వర్గ నేతకు దక్కే అవకాశముందంటున్నారు. మూడో సీటుపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదేవిధంగా, జార్ఖండ్‌లో జేఎంఎంతో ఉన్న పొత్తులో భాగంగా 2 సీట్లలో ఒకటి కాంగ్రెస్‌కు కేటాయించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజస్థాన్‌లో మూడు సీట్లకుగాను



కాంగ్రెస్ ఒక సీటును సులభంగా గెలుచుకునే అవకాశం ఉంది. ఈ సీటు కోసం ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, సిట్టింగ్ ఎంపీ నీరజ్ డాంగీ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మధ్యప్రదేశ్ నుంచి మాజీ ముఖ్య మంత్రి కమల్ నాథ్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ పేర్లు తెరపైకి వచ్చాయి. సోనియా గాంధీ సహా పార్టీ అగ్రనేతలను ఇటీవల కమల్ నాథ్ కలిసి రాజ్యసభ నామినేషన్‌పై ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

**24 అక్బర్ రోడ్ బంగ్లాపై దృష్టి..**

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రుల్లో ఒకరిని రాజ్యసభకు పంపే అవకాశాలను అధిష్టానం సీరియస్‌గా పరిశీలిస్తోంది. దీనికి రాజకీయ ప్రాధాన్యంతో పాటు వ్యూహాత్మక కారణా లూ ఉన్నట్లు చెబుతున్నారు. ప్రత్యేకంగా, ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్ ప్రాంతంలోని టైప్--7 ప్రభుత్వ బంగ్లాను కొనసాగించుకోవడం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణంగా భావిస్తున్నారు. సాధారణంగా మాజీ ముఖ్యమంత్రులకు ఇలాంటి వసతి కేటాయించే అవకాశం ఉండటంతో, కమల్ నాథ్, భూపేష్ బఘేల్, అశోక్ గెహ్లాట్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్ టైప్--7 బంగ్లా అధికారికంగా ఏ వ్యక్తి పేరుతోనూ కాకుండా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయ వినియోగం కోసం కేటాయించిన ప్రభుత్వ వసతిగా ఉంది. ఇది గతంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యాలయంగా ఉండేది. అయితే, కాంగ్రెస్ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిర భవన్‌కు మారిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం ఈ బంగ్లాను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసింది. దీంతో ఈ బంగ్లాను కొనసాగించుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి లేదా మాజీ కేంద్ర మంత్రిని రాజ్యసభకు పంపించి, వారి పేరుతో బంగ్లాను మళ్లీ తమ వద్దే ఉంచుకునే వ్యూహంలో అధిష్టానం ఉన్నట్లు గా కాంగ్రెస్ వర్గాలంటున్నాయి.

# భవిష్యత్‌లో యుద్ధాలు కేవల సరిహద్దుకే పరిమితం కావు

భవిష్యత్ యుద్ధాలు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా మల్టీ-డొమైన్ విధానంలో జరుగుతాయని భారత సాయుధ దళాల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్? అనిల్? చౌహాన్? వ్యాఖ్యానించారు. భూభాగం, సముద్రం, గగనం మాత్రమే కాకుండా సైబర్, కాగ్నిటివ్ వార్‌ఫేర్ వంటి రంగాలు కూడా యుద్ధాల్లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక యుద్ధాలు ఇకపై కేవలం సైనిక బలం, సంప్రదాయ ఆయుధాలు లేదా ప్లాట్‌ఫామ్ ఆధారిత ఆపరేషన్లతో మాత్రమే పరిమితం కావని స్పష్టం చేశారు. శనివారం మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఒక రక్షణ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అనిల్ చౌహాన్ ఈమేరకు వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ సిస్టమ్స్, ఆటోనమస్ ప్లాట్‌ఫామ్స్, అంతరిక్ష సాంకేతికతలు భవిష్యత్ యుద్ధాలకు నిర్ణయాత్మక రూపం ఇస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో సాంకేతికత, వేగం, ఆవిష్కరణలే విజయవంతమైన సైనిక ఆపరేషన్లను నిర్ణయిస్తాయని సీడీఎస్ తెలిపారు.

భవిష్యత్‌లో యుద్ధభూములు కేవలం భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావని, సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్‌లు, సైబర్ మౌలిక వసతులు కూడా



యుద్ధరంగాలుగా మారతాయని ఆయన హెచ్చరించారు. ఏ దేశం వేగంగా సాంకేతిక ఆవిష్కరణలు చేస్తుందో, రక్షణ ఉత్పత్తిని త్వరగా పెంచుతుందో, అలాగే తమ సాయుధ దళాలను కొత్త పరిస్థితులకు వేగంగా అనుగుణంగా మార్చుకుంటుందో ఆ దేశానికే వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తుందని జనరల్ చౌహాన్ అన్నారు.

**వారిదే భవిష్యత్తు**

విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు కేంద్రంగా పేరుగాంచిన షిర్డీ, నేడు రక్షణ రంగ తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, జాతీయ భద్రతకు కేంద్రంగా ఆవిర్భవించనుందని సీడీఎస్? జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న? లక్ష్యం దిశగా ఎన్ఐబీఈ షిర్డీ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ముందడుగు వేయనుందని తెలిపారు. 'విక?సిత్ భారత్' నిర్మాణానికి ఇంజినీరింగ్ విద్యార్థులను, యువ ఆవిష్కర్తలు ముందుకు రావాలని చౌహాన్? కోరారు. "మార్పును సృష్టించే వారిదే భవిష్యత్తు. మీరే భారతదేశపు శక్తి. మీరే వికసిత్? భారత్ రూపశిల్పులు. ఎప్పుడూ ఒకటి గుర్తుంచుకోండి, సరైన మార్గంలో పయనించడం వల్ల తాత్కాలిక ఎదురుదెబ్బలు, కొన్ని ఒడిదుడుకులు ఎదురుకావచ్చు. కానీ అవన్నీ జీవితంలో సహజమే. దారిలో వచ్చే మలుపు, ఆ దారికి అంతం కాదు" అని ఆయన అన్నారు.

**ప్రైవేట్ రక్షణ రంగ విశ్వాసానికి నిబే గ్రూప్ ఒక ఉదాహరణ**

ఇదిలా ఉండగా, రక్షణ ఉత్పత్తిలో భారత్ సాధించిన పురోగతిని హైలైట్ చేస్తూ, దేశీయ రక్షణ తయారీ దాదాపు రూ. 1.27 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకుందని సీడీఎస్ పేర్కొన్నారు. అలాగే, రక్షణ ఎగుమతులు రూ. 38,000 కోట్లు దాటాయని, భారత రక్షణ ఉత్పత్తులు ఇప్పుడు 100కు పైగా దేశాలకు చేరుతున్నాయని ఆయన తెలిపారు.

## కలిసి పనిచేద్దాం!

-మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియాలో పోస్టుచేశారు. భారత్--అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నిరంతర పురోగతి, ప్రాంతీయ, ప్రపంచ శాంతి భద్రతకు సంబంధించిన అంశాలపై తాము చర్చించామని వెల్లడించారు. రెండు దేశాలు నిరంతరం సన్నిహితంగా కలిసి పనిచేస్తూనే ఉంటాయన్నారు. వాణిజ్య, రక్షణ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి, కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై సహకారాన్ని వేగవంతం చేయడానికి మోదీ, రూబియో అంగీకరించారని అమెరికా విదేశాంగ శాఖ తెలియజేసింది.

**భారత్ అత్యంత ముఖ్యమైన భాగస్వామి**

భారత్, అమెరికాలు అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతి గురించి రూబియో ప్రధాని మోదీకి వివరించారని భారత ప్రభుత్వవర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారని పేర్కొన్నాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సంఘర్షణలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మరోసారి పిలుపునిచ్చారని స్పష్టంచేశాయి. మోదీ, రూబియో మధ్య ఫలవంతమైన సమావేశం జరిగిందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. భారత్ తమకు అత్యంత ము ఖ్యమైన భాగస్వామి అని రూబియో తేల్చిచెప్పారు. మోదీతో భేటీ అనంతరం అమెరికా ఎంబసీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు రాబోయే రో జుల్లో ఇరుపక్షాలు కొన్ని కీలక ప్రకటనలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయని తెలిపారు. ఇండో--పసిఫిక్ విషయంలో వాషింగ్టన్ విధానానికి భారతదేశం 'ఒక మూలస్తంభం'అని అభివరి?ఇంచారు.

**మోదీకి అమెరికా ఆహ్వానం**

త్వరలో అమెరికా పర్యటించాలని, వైట్‌హౌస్‌ను సందర్శించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున మార్కో రూబియో ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. ఈ విషయం అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలియజేశారు. మోదీతో భేటీ సందర్భంగా ఈ ఆహ్వానం అందించారని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్‌కు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయాలని రూబియోను మోదీ కోరారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది. ట్రంప్‌తో సంభాషణ కోసం ఎదురుచూస్తున్నానని చెప్పారని వెల్లడించింది.

**కోల్‌కతాలో మదర్ హౌస్‌ను సందర్శించిన రూబియో**

నాలుగు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన మార్కో రూబియో తొలుత కోల్‌కతాలో అడుగుపెట్టారు. సెర్గియో గోర్ ఆయనకు స్వాగతం పలికారు. అమెరికా విదేశాంగ మంత్రి ఒకరు కోల్‌కతాలో పర్యటించడం 14 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. చివరిసారిగా 2012 మే నెలలో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ ఇక్కడ పర్యటించారు. మార్కో రూబియో కోల్‌కతాలో ప్రఖ్యాత మదర్ హౌస్‌ను సందర్శించారు. ఇది భారత రత్న మదర్ థెరిసా స్థాపించిన 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' ప్రదాన కార్యాలయం. మదర్ హౌస్ అధికారులతో రూబియో మాట్లాడారు. అనంతరం నిర్మల శిశు భవన్ కూడా సందర్శించారు. ఇది మిషనరీస్ ఆఫ్ చారిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పిల్లల సంరక్షణ కేంద్రం. రూబియో ఈ నెల 26వ తేదీ వరకు భారత్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 'క్వాడ్'దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతారు. ఢిల్లీతోపాటు ఆగ్రా, జైపూర్‌లో పర్యటిస్తారు.

## మరోసారి పెట్రో ధరల పెంపు

స్వర్ణసాగరం దిల్లీ/ హైదరాబాద్

పెట్రోలియం ఉత్పత్తుల ధరల్ని ప్రభుత్వరంగ చమురు సంస్థలు మరోసారి పెంచాయి. లీటరు పెట్రోలుపై 87, డీజిల్‌పై 91 పైసలు చొప్పున పెరగడంతో ఎనిమిది రోజుల వ్యవధిలో మొత్తంగా రూ.5 వరకు భారం పడినట్లయింది. తాజా పెంపుతో దిల్లీలో లీటరు పెట్రోలు రూ.99.51కి, డీజిల్ రూ.92.49కి చేరింది. హైదరాబాద్‌లో పెట్రోలు ధర రూ.112.74కి, డీజిల్ ధర రూ.100.88కు చేరుకుంది. సీఎన్జీ ధరను కూడా కిలోకు ఒక రూపాయి చొప్పున పెంచారు. ఇది ఎనిమిది రోజుల్లో మూడు విడతల్లో కిలోకు రూ.4 పెరిగింది. దిల్లీలో కిలో సీఎన్జీ ధర రూ.80.09 నుంచి రూ.81.09కి చేరింది. ప్రైవేటు రంగంలో నయారా ఎనర్జీ, షెల్, జియో-బీపీ వంటివి కూడా పెట్రోలు, డీజిల్ ధరల్ని పెంచాయి. పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రజల డబ్బును వాయిదాల పద్ధతిలో కేంద్రం దోచుకుంటోందంటూ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు.

## భవ్య పథకం కింద 50 పారిశ్రామిక పార్కులు

భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకం కింద 50 పారిశ్రామిక పార్కుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రాలకు 4 నెలల గడువు ఇచ్చామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. శనివారం (మే 23) నుంచి రానున్న నాలుగు నెలల్లోగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దరఖాస్తులను సమర్పించొచ్చన్నారు. ఇందులోని 20 పారిశ్రామిక పార్కులకు తొలి రెండు నెలల్లో, మిగతా 30 పారిశ్రామిక పార్కులకు తదుపరి రెండు నెలల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవ్య పథకం తొలిదశలోనే ఈ మొత్తం 50 పారిశ్రామిక పార్కులకు అనుమతులను మంజూరు చేస్తామని, మిగతా 50 పార్కులకు తదుపరి దశలో అనుమతులు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటురంగ కంపెనీల సంయుక్త భాగస్వామ్యంతో ఈ స్కీం అమలవుతుందని పీయూష్ గోయల్ చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈవివరాలను ఆయన చెప్పారు.

**నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్రాల మధ్య పోటీ**

భవ్య స్కీంలో భాగంగా 100 నుంచి 1000 ఎకరాల్లో ఉండే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి కోసం చేపడతామని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దీనికి ఎంపికయ్యే పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎకరాకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. పర్వత ప్రాంతాలు ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో 25 ఎకరాల్లో ఉండే పారిశ్రామిక పార్కులనూ భవ్య స్కీంకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ పథకానికి కేంద్రం కేటాయించిన రూ.33,660 కోట్ల నిధులను, వీటితో ముడిపడిన ప్రాజెక్టులను దక్కించుకోవడానికి రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడతాయని పీయూష్ గోయల్ అన్నారు. భూమి, నీరు, విద్యుత్ వంటి మెరుగైన సౌకర్యాలను కల్పించే రాష్ట్రాలే పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. రాజస్థాన్, మహారాష్ట్ర, బంగాల్, హరియాణా వంటి రాష్ట్రాలు భవ్య స్కీంపై తీవ్ర ఆసక్తిని చూపుతున్నాయన్నారు.

**ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులకు ఎకరాకు రూ.50 లక్షలు**

"రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకొని ప్రతిపాదనలను సమర్పించేందుకు అనుమతించే ఒక నిబంధన కూడా భవ్య పథకంలో ఉంది. ఇలాంటి సందర్భాల్లో భవ్య పథకానికి ఏదైనా ప్రాజెక్టు ఎంపికైతే, ఎకరాకు రూ. 50 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర సర్కారు అందిస్తుంది. రాష్ట్రాలు తమ దరఖాస్తులకు వేగవంతమైన ఆమోదం లభించేలా చూసేందుకు ఒక స్పెషల్ పర్పజ్ వెహికల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసి, ఒక ప్లానింగ్ అథారిటీని నియమించాలి. సింగిల్ విండో క్లియరెన్స్ యంత్రాంగాన్ని కూడా స్థాపించాలి.రానున్న మూడేళ్లలో ఈ 50 పారిశ్రామిక పార్కులు కార్యరూపం దాలుస్తాయని మేం ఆశిస్తున్నాం" అని పీయూష్ గోయల్ తెలిపారు. పరిశ్రమలు పెట్టాలనుకునే కంపెనీలకు సకల వసతులతో కూడిన పారిశ్రామిక ప్రాంతాలను అందించడమే భవ్య పథకం లక్ష్యం. కంపెనీ లేదా ఇన్వెస్టర్ కేవలం తమ యంత్రాలను తెచ్చుకుని, ఇక్కడ వెంటనే ఉత్పత్తిని ప్రారంభించుకోవచ్చు. రోడ్లు, నిరంతర విద్యుత్, నీటి సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీ, గిడ్డంగులు, కార్మికుల వసతి గృహాలు వంటివన్నీ ఈ పారిశ్రామిక పార్కుల్లో ముందే నిర్మించి ఉంటాయి. పర్యావరణ, స్థల అనుమతులు ముందే లభిస్తాయి. ఈ పథకం క్లస్టర్ ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. పరిశ్రమలు, సరఫరాదారులు, సేవా ప్రదాతలను ఒకేచోటకు చేరుస్తుంది. తద్వారా దేశీయ సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుంది. ప్రాంతీయ పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తుంది. లక్షలాది మందికి కొత్త అవకాశాలను సృష్టిస్తుంది.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభం

- ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్
- మున్సిపాలిటీల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా మార్చడమే కార్యక్రమం లక్ష్యం
- పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన మంత్రి
- అన్న క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి నారాయణ





విజయవాడ, స్వర్ణసాగరం

రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ నాలుగు వారాల ప్రత్యేక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని సాంబమూర్తి రోడ్డులో గల కూర్మయ్య బ్రిడ్జి వద్ద నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభ కార్యక్రమాన్ని మంత్రి పి. నారాయణ, స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే. పట్టాభిరామ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ బి. అనిల్ కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, ఆపరేషన్ క్లీన్ స్వీప్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ... ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రత చేపడతారన్నారు. రెండో వారంలో ప్రజల భాగస్వామ్యంతో కాలువల క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడో వారంలో ఇళ్ళు, కమర్షియల్ సంస్థల వద్ద చెత్త వర్గీకరణ (సెగ్రిగేషన్)పై అవగాహన కల్పిస్తారు. నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 అక్టోబర్ 2న మచిలీపట్నంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి మూడో శనివారం ఒక జిల్లాను సందర్శిస్తూ ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో వదిలేసిన సుమారు 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలలో, గ్రౌండ్ పైన ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను అధికారులు రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2025 అక్టోబర్ 2 నాటికి ఏడాదిలోనే తొలగించారు. మిగిలిన భూగర్భ చెత్తను కూడా వచ్చే జూన్ చివరి నాటికి పూర్తిగా క్లియర్ చేసే దిశగా వేగంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో చెత్తను విద్యుత్‌గా మార్చే "వేస్ట్ టు ఎనర్జీ" ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రస్తుతం విశాఖపట్టణం, గుంటూరు ప్రాంతాల్లో ప్లాంట్లు పనిచేస్తుండగా, మరో ఆరు ప్లాంట్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇవి రాబోయే రెండేళ్లలో పూర్తై చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నాయన్నారు. అలాగే ప్లాంట్లు లేని మిగిలిన 123 మున్సిపాలిటీల్లో చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసే విధంగా టెండర్లు పిలిచారన్నారు. వచ్చే నెల జూన్ చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తులో డంప్‌యార్డ్స్ లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను సమర్థవంతంగా అమలు చేస్తూ, 2000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు లభించాయని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సూపర్ లీగ్‌లో స్థానం సంపాదించుకోవడం సంతోషకరమని పేర్కొంటూ, స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు అందరూ సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర సాధనలో స్వచ్ఛాంధ్ర కీలక పాత్ర పోషిస్తుందని మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ... విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విజయవాడలో 3600 మంది శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రెడ్, ఎల్లో స్పాట్ల నిర్మూలన, డ్రైన్ల శుభ్రత, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. బహిరంగ మూత్ర విసర్జన నివారణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు, వ్యాపారులు, బల్క్ వేస్ట్ జనరేటర్లు అందరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే విజయవాడను మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దగలమని సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, యువతతో పాటు సమాజంలోని ప్రతి వర్గం పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడి, వారి ఆదాయం పెరిగి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమర్థవంతంగా అమలు చేయాలంటే ముందుగా పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు టెర్రస్ గార్డెన్ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నగర ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# వైకాపా 'మళ్లీ రావద్దు'

-మొదటిపేజీ తరువాయి

తెరిస్తే అబద్ధాలు ఆడుతూ.. మీడియా ముందుకొచ్చి నాటకాలు చేస్తున్నారు. ఇదంతా గొడ్డలి పార్టీ నైజం' అని వైకాపాను ఉద్దేశించి విమర్శించారు. కోడికత్తి, గులకరాయి డ్రామా, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహం డోర్ డెలివరీ, మాస్క్ అడిగిన వైద్యుడు సుధాకర్ ఉదంతాలు సహా వైకాపా హయాంలో జరిగిన 11 నిర్వాకాలను ప్రజలకు చంద్రబాబు వివరించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో తెలుసా అని ఆయన ప్రశ్నించగా సభికులంతా తెలుసని చేతులెత్తారు. 'ఈ పెద్ద మనిషి (జగన్) నేను చంపించానని మాట్లాడుతున్నాడు. ఆరోజూ అలాగే తప్పుడు వార్తలు రాసి రాజకీయ లబ్ధి పొందారు. కుటుంబ బంధాలపైనా గొడ్డలి వేటు వేసి ఆస్తి ఇవ్వకుండా తల్లి, చెల్లికీ అన్యాయం చేశాడు. ఇలాంటి వ్యక్తి ప్రజలకు న్యాయం చేస్తాడా? తల్లికి అన్నం పెట్టని వ్యక్తి పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా?' అని చంద్రబాబు దుయ్యబట్టారు. గతంలో హిందూ దేవుళ్లపై అకృత్యాలు, కుట్రలకు పాల్పడ్డారని.. ఇప్పుడు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు రోజుకో నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. పాస్టర్లతోనూ దాడి డ్రామాలు ఆడిస్తున్నారని ధ్వజమెత్తారు.



**ఆసుపత్రికి వెళ్లే అవసరం తగ్గడమే అభివృద్ధి**

అనంతరం సంతగేటు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరును చంద్రబాబు పరిశీలించారు. 'లక్ష్మణుడిని బతికించడానికి హనుమంతుడు సంజీవని మొక్క ఉన్న ద్రోణగిరి పర్వతాన్నే తీసుకొచ్చాడు. దానిలో కొంత భాగం 14.కండ్రిగకు సమీపంలో ఉన్న అర్ధగిరిలో పడిందని, ఆ ప్రాంతంలో నీళ్లు తాగితే ఆరోగ్యంగా ఉంటారని ప్రతీతి. ఇలాంటి గడ్డపై సంజీవని ప్రాజెక్టుపై సమీక్షించడం ఆనందంగా ఉంది. ఆస్తి, పదవి ఉన్నవారి కన్నా సంపూర్ణ ఆరోగ్యవంతులే ధనికులు. గతేడాది జులై 3న కుప్పంలో సంజీవని ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా మొదలుపెట్టగా, ఈ ఏడాది మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లాలో ప్రారంభించాం. ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. భవిష్యత్తులో 41 వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఈ ప్రాజెక్టుతో ప్రపంచస్థాయి వైద్య సేవలు, ఏఐ వైద్యుణ్ని అందుబాటులోకి తెస్తాం. ఫ్యామిలీ డాక్టర్‌నూ నియమిస్తాం. వ్యాధి రాక ముందే అప్రమత్తం చేయాలన్నదే మా ఆలోచన. ఆసుపత్రులు పెరగడం కాదు.. వెళ్లాల్సి అవసరం తగ్గడమే నిజమైన అభివృద్ధి. అది చేసి చూపిస్తాం. భవిష్యత్తు సుస్థిరంగా ఉండే పాలసీలపై దృష్టి పెట్టాం. పిల్లలే సంపద.. వారు లేకపోతే మీరు యంత్రాల కోసం పనిచేయాల్సి వస్తుంది. నేను మితంగా, పౌష్టికాహారం తీసుకుంటా. అందుకే పిల్లల కన్నా హుషారుగా ఆలోచిస్తా. రాబోయే 50 ఏళ్లకు ఏం కావాలో ఇప్పుడే ఆలోచిస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

**మల్లన్న నుంచి వెంకన్నకు నీళ్లు**

'శ్రీశైలం మల్లన్న నుంచి తిరుమల వెంకన్న వరకు ఈ ఏడాదే కృష్ణా నీళ్లు తీసుకొస్తాం. అన్నమయ్య కలెక్టర్ నీటిని సమర్థంగా వినియోగించి భూగర్భ జలాలను 8.5 మీటర్లకు పెంచారు. పిడుగురాళ్లలో 49.2 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మదనపల్లెలో 40 డిగ్రీలే ఉంది. తర్వాత తక్కువ ఉష్ణోగ్రత చిత్తూరు జిల్లాలో ఉంది. గాలేరు-నగరిని 2028 డిసెంబరు, సోమశిల-స్వర్ణముఖిని 2028 జూన్‌కు పూర్తి చేస్తాం. ఈ ఏడాది ఎల్‌నినో వచ్చింది, వర్షపాతం తగ్గుతుందనే అంచనాలున్నాయి.. అప్రమత్తంగా ఉండి దాన్ని ఎదుర్కొందాం' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**మీరు పరీక్షల్లో పాస్ కాలేదమ్మా**

చివర్లో సీఎం చంద్రబాబు వివిధ శాఖలకు సంబంధించి ప్రజల సంతృప్తి స్థాయి గణాంకాలు వెల్లడించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే మెరుగ్గా ఉన్న అధికారులను అభినందించారు. సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్న శాఖల అధికారులను పనితీరు మార్చుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు. ఆలయాల్లో దర్శనం, వసతి, తదితర సదుపాయాలపై రాష్ట్రంతో పోలిస్తే జిల్లా సగటు 0.17 శాతం తక్కువగా ఉందన్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మను ఉద్దేశించి 'మీరు పరీక్షల్లో పాస్ కాలేదమ్మా' అని సరదాగా అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ సంతృప్తి స్థాయి తక్కువగా ఉండటాన్ని గుర్తు చేస్తూ గిరిజన పిల్లలంటే మీకు చులకనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, టాటా మెడికల్ అండ్ డయాగ్నస్టిక్స్ సీఈవో, ఎండీ గిరీష్ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథరెడ్డి, భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు. యాదమరి పీహెచ్‌సీని పరిశీలించిన సీఎం.. అక్కడున్న రోగులు, వారి బంధువులతో సంజీవని సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నుంచే కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలోని వైద్యులు, బెంగళూరులోని టాటా సంస్థకు చెందిన నిపుణులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు.

సాయంత్రం వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో చంద్రబాబు హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరారు.

మూడోబిడ్డ సాయం.. మొదట మీకే వస్తుందేమో!

యాదమరి పీహెచ్‌సీలో లత అనే మహిళ తాను మూడోసారి తల్లిని కాబోతున్నానని సీఎం చంద్రబాబుకు చెప్పారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని తరచూ చెబుతున్నాను.. ఎక్కువ మంది పిల్లలను కంటే ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని సీఎం అన్నారు. మొదటి సాయం మీకే వస్తుందేమోనని చమత్కరించారు.

## చంద్రబాబుపై ఎమ్మెల్యే శ్రీధర్ విమర్శలు వెంటనే చర్యలు తీసుకున్న పవన్



స్వర్ణసాగరం అమరావతి/రైల్వేకోడూరు:

రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళలను వేధించినా, ఒక వర్గం మహిళలను కించపరిచినా ఇప్పటివరకు చర్యలు తీసుకోని పవన్ కళ్యాణ్..ఐఅరవ శ్రీధర్ చంద్రబాబును ఒకమాట అన్నట్లు వీడియో బయటకు రాగానే వెంటనే చర్యలు తీసుకున్నారు. దాదాపు ఐదారు నెలలుగా ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగిని.. అరవ శ్రీధర్ తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి ఐదుసార్లు గర్భవతిని చేసి అబార్షన్ చేయించి మోసం చేశాడని మీడియా ఎదుట కన్నీటి పర్యంతమవుతున్న విషయం రాష్ట్రవ్యాప్తంగా తెలిసిందే. అయినా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నుంచి కనీస స్పందన లేదు. రెండురోజుల కిందట ఒక వర్గం మహిళలను అత్యంత దారుణంగా కించుపరుస్తూ శ్రీధర్ మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపైనా పవన్ చర్యలు తీసుకోలేదు. తాజాగా సీఎం చంద్రబాబు.. వాడు వేస్ట్.. అంటూ ఏకవచనంతో సంబోధిస్తూ అరవ శ్రీధర్ మాట్లాడిన వీడియో సైతం వైరల్ అవుతుండడంతో హడావుడిగా విప్ పదవికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆయనతో రాజీనామా చేయించారు. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను కలిసి అరవ తన రాజీనామా లేఖను అందజేశారు. వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు.

**మహిళల విషయంలో స్పందించకుండా.. చంద్రబాబును అనగానే ఆగమేఘాలపై చర్యలు**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తో సమావేశం తర్వాత అరవ శ్రీధర్ విప్ పదవికి రాజీనామా చేసినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ లేఖను మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వంలో కీలక పదవిలోనే ఉన్న అరవ శ్రీధర్ రాసలీలల వీడియోల వ్యవహారం గత ఐదారు నెలలుగా అటు జనసేన పార్టీలో, ఇటు కూటమిలోనూ రాజకీయ దుమారం రేపుతున్నా పవన్ కళ్యాణ్ కనీసం స్పందించలేదు. ఇప్పటి వరకు ఆయనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదు. తాజాగా ఒక వర్గం మహిళలను దారుణంగా కించపరుస్తూ మాట్లాడిన ఆడియో వైరల్ అవుతోంది.

ఈ విషయంలో సర్వత్రా ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నా కూడా పవన్ కనీసం ఖండించలేదు.. అయితే సీఎం చంద్రబాబును వేస్ట్ అంటూ మాట్లాడిన వీడియో బయటకు రావడంతో ఆగమేఘాలపై ఆయన్ని పిలిపించి రాజీనామా చేయించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఎమ్మెల్యే శ్రీధర్‌పై ప్రభుత్వ మహిళా ఉద్యోగిని మోసం చేశాడనే ఆరోపణలు రావడంతో నేపథ్యంలో ముగ్గురు నేతలతో జనసేన నిజ నిర్ధారణ కమిటీ వేసింది. అయితే దాదాపు నాలుగు నెలలుగా పార్టీ ఎలాంటి చర్యలు చేపట్టకపోగా.. ప్రభుత్వ విప్ హోదాలో అరవ శ్రీధర్ మాత్రం పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రెండు నెలల క్రితం అతని అనుచరులు నడిరోడ్డుపై బాధిత మహిళా ఉద్యోగి మీద పోలీసుల సమక్షంలోనే దాడికి కూడా పాల్పడ్డారు. మరోవైపు.. అరవ శ్రీధర్ రెండురోజుల కిందట ఓ సామాజిక వర్గం మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో పవన్‌కళ్యాణ్ తమ పార్టీ ఎమ్మెల్యే మహిళలను మోసం చేసినా.. ఒక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడితే స్పందించకపోగా.. చంద్రబాబు విషయానికి వచ్చేసరికి తక్షణ చర్యలు తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

**తీవ్ర అవినీతి ఆరోపణలున్న మరో ఎమ్మెల్యేతో భేటీ**

ఇటీవల కాలంలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సైతం శనివారం పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యే బాలరాజును అధినేత పవన్‌కళ్యాణ్ వివరణ అడిగారంటూ పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేకి గడువు ఇచ్చారని పార్టీ తెలిపింది.



## భానుడి భగభగలు

-మొదటిపేజీ తరువాయి

పోలవరం జిల్లా కూనవరం, పల్నాడు జిల్లా శ్రీనగర్‌లో 45 డిగ్రీలు, ఎన?టఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, నేడు (ఆదివారం) 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ వెల్లడించింది.

రాష్ట్రంలోని 214 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45, 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ?చమ గోదావరి, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42--44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40--42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందని విపత్తుల శాఖ తెలిపింది. దీని ప్రభావంతో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, మన్యం, అల్లూరి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా వడగాడ్పులకు శనివారం 8 మంది మృత్యువాతపడ్డారు. ఎన?టఆర్ జిల్లాలో ఆరుగురు, ప్రకాశం జిల్లాలో

# పోలేరమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలి





**– దద్దాల నారాయణ యాదవ్**

కనిగిరి స్వర్ణ సాగరం మే 23

వెలిగండ్ల మండలం,హుస్సేన్ పురం పంచాయతీ తమ్మనేనిపల్లి గ్రామంలో శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మ వారి తిరునాళ్ల మహోత్సవంలో వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణ చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఆయనకు అందజేశారు.తదుపరి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను ఘనంగా సత్కరించారు.శ్రీ పోలేరమ్మ తల్లి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సకల ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు,మరియు సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తమ్మనేని శివరామిరెడ్డి,తమ్మనేని గోవిందరెడ్డి,కర్నాటి ప్రభాకర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,తమటం దశరథరెడ్డి,ఆవుల శ్రీనివాసులరెడ్డి ఉండేల రామిరెడ్డి,ఉండేల రామకృష్ణారెడ్డి,చిలకల శ్రీనివాసుల రెడ్డి,చిలకల వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుంజలూరుపాడులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్యపు పనులు"







## గిరిజన కాలనీలో సమస్యలు తెలుసుకున్న సురేష్ నాయుడు ఏఎంసి డైరెక్టర్ వాణి భవాని నాయుడు

వెంకటాచలం స్వర్ణసాగరం మే 23

మండలంలోని పుంజులూరుపాడు గ్రామ గిరిజన కాలనీలో శనివారం సర్వేపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఏం సి డైరెక్టర్ వాణి భవాని నాయుడు సందర్శించారు, ఈ సందర్భంగా కాలనీలోని కాలువలలో బ్లీచింగ్ తో పాటు క్లోరిన్ చర్యలు చేపట్టారు. అంగన్వాడి పిల్లలకు తినుబండారాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదేశాలతో గిరిజన కాలనీలలో పరిస్థితులను సమీక్షించి పంచాయతీల ద్వారాకోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం జరుగుతుందన్నారు గత ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన విమర్శలను ఖండించారు. పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటాచల మండలం కార్యదర్శి ఎస్ శ్రీహరి పోర్టల్ సుబ్రహ్మణ్యం ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు చిన్న రహీం విజయ్ తదితరులు పాల్గొన్నారు

# పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలం కండ్రిగలో సంజీవని కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు













**చిత్తూరు జిల్లా/పూతలపట్టు:**

ఈ ఏడాది వాతావరణంలో మార్పులు వచ్చాయి, ఎల్ నినో కారణంగా వర్షాలు తగ్గుతాయని అంచనాలు వచ్చాయి.

ఈ సంక్షోభాన్ని కూడా సవాలుగా తీసుకుని ముందుకు వెళ్దాం.

కేవలం 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చాం.

23 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత ఈ ప్రభుత్వానిది.

పుట్టపర్తిలో 5వ తరం యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం.

యుద్ధాల్లో పాల్గొనే జెట్ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి మారబోతోంది.

రాయలసీమ ఓ డిఫెన్స్ హబ్ గా మారబోతోంది.

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే మా లక్ష్యం.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది.

కర్నూలులో డ్రోన్ సిటీ, ఏరోస్పేస్, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం.

తిరుపతిలో త్వరలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ వస్తోంది.

రాయలసీమలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలు రాబోతున్నాయి.

వచ్చే నెల బంగారం గనుల్ని కర్నూలు జిల్లాలో ప్రారంభించబోతున్నాం.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి.

రాయలసీమను రూ. 1 లక్ష కోట్లతో హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తాం... ప్రభుత్వం రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోంది... రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి.

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల వంటగ్యాస్ కొరత వచ్చింది, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి... ఈ సవాళ్లన్నీ మనం ఎదుర్కోవాలి.

7 అంశాల ద్వారా పొదుపు మంత్రం పాటించాలని ప్రధాని మోదీ చెప్పారు.

రాష్ట్రంలో మహిళల కోసం పని చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీనే.

తల్లికి వందనం, స్త్రీశక్తి లాంటి పథకాలు తెచ్చాం.

దీపం పథకం ద్వారా మహిళలకు వంటింటి ఖర్చులు తగ్గి జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కింద మహిళల్ని వ్యాపారవేత్తలుగా మార్చి వారి ఆర్థిక సాధికారిత కోసం పని చేస్తున్నాం.

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించటమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

మహిళలపై జరిగే నేరాల విషయంలో ప్రజా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తాం.

మానవ మృగాలు అక్కడక్కడా రెచ్చిపోతున్నారు. వారిని అణచివేస్తాం.

హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

ప్రజల ప్రాణాలు కాపాడే రాజకీయాలు ఒకవైపు... ప్రజలను భయపెట్టి, మోసం చేసే రాజకీయాలు ఇంకోవైపు ఉన్నాయి.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేస్తే... గొడ్డలి పార్టీ ఫ్రస్టేషనుతో తట్టుకోలేకపోతోంది... గంగవెర్రులు ఎత్తుతోంది.

రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం – అభివృద్ధి కార్యక్రమాలను చూసి గొడ్డలి పార్టీ తట్టుకోలేక పోతోంది.

నోరు తెరిస్తే అబద్ధాలు... మీడియా ముందుకొచ్చి మంచోడినంటూ మాటలు... ఇదీ గొడ్డలి పార్టీ నైజం.

5 ఏళ్ల రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి నిద్ర లేకుండా చేశారు. ప్రజలకు నరకం చూపించారు... ప్రజలందరిలోనూ భయాందోళనలు కల్పించారు.

కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే స్వేచ్ఛ కల్పించాం.

అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా... వైసీపీ గొడ్డలి పార్టీగానే వ్యవహరించింది.

# తోటపల్లి గూడూరు హరిజనవాడలోపోలీసుల కార్టన్ సెర్చ్

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే 23

తోటపల్లి గూడూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వీరేంద్రబాబు సీఐ రఘుబాబు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసిహరిజనవాడలో శనివారం కార్టన్ సెర్చ్ నిర్వహించారు.లైసెన్స్ లేని రిజిస్ట్రేషన్ కానీ మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారుస్థానికులకుఅవగాహన కల్పిం చారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డిఎస్పి ఆదేశాలతో సీఐ ఆధ్వర్యంలో కార్టన్ సెర్చ్ నిర్వహిం చిన ట్టు తెలిపారు.హరిజనవాడలో లైసెన్సు లేని రిజిస్టర్ కానీ మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారువాటి వివరాలు తెలిపి తీసుకొని పోవాల్సిందిగా కోరారునిబంధనలకు విరుద్ధంగా గంజాయి ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారుగంజాయి రవాణా కొత్త వ్యక్తులు వచ్చిన సందర్భంలో పోలీసులకు సమాచారం అందించాలన్నారు





తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# కనిగిరి ఆర్డీఓ అజయ్ కుమార్ గారికి కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా సమర్పించిన పార్టీ శ్రేణులు



కనిగిరి స్వర్ణ సాగరం మే 23

పార్టీ అధ్యక్షులు,మాజీ సీఎం వైయస్ జగన్ మెహన్ రెడ్డి పిలుపు మేరకు,ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు,దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి సూచనల మేరకు మరియు వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు శనివారం కనిగిరి ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అజయ్ కుమార్ కుమార్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి (113) 297 పోలింగ్ కేంద్రాలకు సంబందించిన వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను అందజేశారు.ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్,మడతల కస్తూరి రెడ్డి,రాచపూడి మాణిక్యరావు,పోలక సిద్ధారెడ్డి, చీమలదిన్నె బ్రహ్మ రెడ్డి వైసీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలి

**–మంత్రి స్వామి,ఎమ్మెల్యే ఉగ్ర**




కనిగిరి స్వర్ణ సాగరం మే 23

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం శనివారం కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని ఏపీఎస్ఆర్టీసీ ప్రాంగణం నందు పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, మరియు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్, అధికారులు,మునిసిపల్, సచివాలయ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జలధార - జలహారతి పనుల తనిఖీ చేసిన డ్వామా పీడీ




స్వర్ణ సాగరం ఏర్పేడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏర్పేడు మండలంలో చేపడుతున్న "జలధార – జలహారతి" పనులను డ్వామా పథక సంచాలకులు ఎం.సి. మద్దిలేటి శనివారం తనిఖీ చేశారు. మండలంలోని 12 గ్రామపంచాయతీల పరిధిలో రూ.35,56,848 వ్యయంతో 25 పంట కాలువలు, వరవ కాలువల పనులకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు.ఇప్పటివరకు 23 పనులు ప్రారంభించి రూ.12,98,708 వ్యయం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా పల్లం గ్రామపంచాయతీలో కొనసాగుతున్న జలధార – జలహారతి పనులను ఎం.సి. మద్దిలేటి పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు చైతన్య వేదిక అభినందన పత్రం అందుకున్న తిరుమూరు మురళి

కోట స్వర్ణసాగరం మే 23



కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన కోట మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు మరియు 33వ యూనిట్ ఇంచార్జ్ తిరుమూరు మురళి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ చేతులు మీదుగా శనివారం మంగళగిరిలో తెలుగు చైతన్య వేదిక అభినందన పత్రం అందుకున్నారు.తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జిల శిక్షణా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు మురళికి తెలుగు చైతన్య వేదిక అభినందన పత్రం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలల సమస్యలను ఎంఈఓ దృష్టికి తెచ్చిన అపస్మా నేతలు



బుచ్చిరెడ్డిపాలెంస్వర్ణ సాగరం మే 23

అపస్మా సభ్యులు మండల విద్యాశాఖ అధికారి కార్లను కలిసి చైల్డ్ ఇన్ఫో లో నుంచి ప్రైవేటు పాఠశాల పేర్లను మా అనుమతి లేకుండా తీయద్దని రాష్ట్ర అపస్మా పిలుపుమేరకు కోర్టు ఆర్డర్ ని కమిషనర్ ఆర్డర్ అందజేశాము. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ నియోజకవర్గ అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి కార్యదర్శి మల్లేశ్వర్ రెడ్డి మంజూరు అహ్మద్ కృష్ణారెడ్డి తదితర కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డాక్టర్ పోగ్రామ్ ను సద్వినియోగం చేసుకోండి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ



పూతలపట్టు స్వర్ణ సాగరం మే 23

పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పోలవరం సచివాలయం పంటపల్లి లో జరుగు ఫ్యామిలీ డాక్టర్ పోగ్రామ్ కు హాజరై ప్రజలకు ఈ పోగ్రామ్ ప్రజలకు గొప్ప వరమని ఇక్కడే వైద్య పరీక్షలు చికిత్స లు కుడా ఇక్కడే ఇస్తామని అందుకే ఇది గొప్ప వరం అన్నారు మధుమేహం రక్తపోటు కు ఇక్కడే పరీక్షలు సేసి నెలకు సరిపడ మందులు ఇక్కడే ఇస్తామన్నారు చిన్న చిన్న జబ్బులకు దూరం వెళ్లకుండా అందరికి ఇక్కడే చికిత్స లు సేస్తామన్నారు కావున ప్రజలు ఈ అవకాశం ను సద్వినియోగం సేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమం లో ఆరోగ్య కార్యకర్త శిల్ప పవన్ కళ్యాణ్ 104 డి ఈ ఓ ఆశలు తేజ శాంతమ్మ పాల్గొన్నారు

# కనిగిరి మంచినీటి దొరువు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి స్వామి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి



కనిగిరి స్వర్ణ సాగరం మే 23

కనిగిరిలోని మంచినీటి దొరువు ఆధునీకరణ పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు.మంచినీటి ఆధునీకరణ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మంత్రికి వివరించారు.దొరువును ఆధునీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణముగా పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

# ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన మంత్రి స్వామి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి



కనిగిరి స్వర్ణ సాగరం మే 23

కనిగిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నతః పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు యోగ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజు యోగ సాధన చేయడం ద్వారా ఏకాగ్రత పెరగటంతో పాటు ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయని ఆయన అన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారభించిన మంత్రి,ఎమ్మెల్యే






కనిగిరి స్వర్ణ సాగరం మే 23

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశుభ్రత మరియు స్వచ్ఛతను లక్ష్యంగా చేసుకుని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే "ఆపరేషన్ క్లీన్ స్వీప్". "ఒక రాష్ట్రం.. ఒక పరిశుభ్రత లక్ష్యం" అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్‌కు ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చిన సందర్భంగా శనివారం కనిగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్ టి సి డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తో కలసి వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లపై ఉన్న చెత్తను ఊడ్చి, మున్సిపాలిటీ ట్రాక్టర్‌లోకి ఎత్తి ప్రతి ఒక్కరూ పారిశుధ్యం పాటించాలని ప్రజలకు మంత్రి,ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కొరకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం చేయాలని నిర్ణయించారని తెలిపారు.మొదటి వారం రోడ్లు, ప్రధాన కూడళ్లు, మరియు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను శుభ్రం చేయడం.రెండవ వారం పట్టణంలోని కాలువలు డ్రైనేజీలను పూడికతీసి శుభ్రపరచడం.మూడవ వారం ఇళ్లు మరియు వ్యాపార సంస్థల నుంచి వచ్చే చెత్తను తడి, పొడిగా విభజించడం.నాల్గవ వారంపబ్లిక్ టాయిలెట్స్ (సార్వజనిక మరుగుదొడ్లు) పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం ఇలా నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం జరిగే విధంగా ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని చెప్పుకొచ్చారు.కేవలం మున్సిపల్ సిబ్బంది మాత్రమే కాకుండా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమని అన్నారు.అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కనిగిరి పురపాలక సంఘం కమిషనర్ పి. శ్రీధర్, డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం,శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్,ప్రభుత్వ అధికారులు,సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది,మున్సిపాలిటీ సిబ్బంది,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థుల భవితకు 'యూటీఎఫ్' భరోసా:

## అభినందనీయమైన సేవా కార్యక్రమాలు






మనుబోలు, మే 23:

ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా, విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్న మనుబోలు యూటీఎఫ్ (ఖుఖీ) శాఖ సేవలు ఎంతో అభినందనీయమని జిల్లా కార్యదర్శి కొనియాడారు. శనివారం మనుబోలు ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**విద్యార్థుల కోసం నిరంతర కృషి :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, సమాజంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గత ఆరు నెలలుగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక మెటీరియల్ అందజేయడం, వారిని సన్నద్ధం చేయడం ద్వారా యూటీఎఫ్ శాఖ విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తోందని అభినందించారు.

**సొంత నిధులతో ప్రోత్సాహం :** కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి మాట్లాడుతూ, "యూటీఎఫ్ సభ్యులు తమ సొంత నిధులను వెచ్చించి విద్యార్థులకు మెటీరియల్ అందించడమే కాకుండా, ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి మెమెంటోలతో సత్కరించడం వారిలో ఉత్సాహాన్ని నింపుతోంది" అని ఆమె ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ నాయకులు రాగయ్య, మనుబోలు మండల నాయకులు శ్రీనివాసులు, అనిల్ కుమార్, శ్యామల, రామయ్య, మహేంద్ర, తులసమ్మ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భగవాన్ వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు..





మనుబోలు : జూన్ 10

(మనం న్యూస్)

మనుబోలు గ్రామంలోని చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో వెలసి ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమాలకు ఉభయ దాతలుగా మనుబోలు గ్రామానికి చెందిన గంధల్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు. అర్చకులు శ్రీనివాసులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్స్ పంపిణి



కనిగిరి స్వర్ణ సాగరం మే 23

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీ కార్యక్రమంలో వికలాంగులు ఒ సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి గారితో పాటు సహచర శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణ రెడ్డి శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ఎర్రగొండపాలెం టిడిపి పార్టీ ఇంచార్జ్ శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబు ఏపీ స్టేట్ విభిన్న ప్రతిభావంతుల కమిటీ చైర్మన్ శ్రీ నారాయణ స్వామి బీజేపీ పార్టీ పార్కాపురం జిల్లా ఇంచార్జ్ శ్రీ కృష్ణా రెడ్డి జనసేనా పార్టీ పార్కాపురం జిల్లా ఇంచార్జ్ శ్రీ కాశి రెడ్డి మరియు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కనిగిరి శాసనసభ్యులు మరియు ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత, ఙూా మరియు జాయింట్ కలెక్టర్ శ్రీ పి. శ్రీనివాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ యం వెంకట శివరామిరెడ్డి గారు మరియు ాణ, డిజెబుల్డ్ శ్ తదితరులు పాల్గొన్నారు.

# పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని సేవలను పరిశీలించిన ముఖ్యమంత్రి











### సంజీవని సహా వివిధ ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకున్న సీఎం

### యాదమరి ఆరోగ్య కేంద్రం నుంచి నిపుణులు, వైద్యులతో వర్చువల్ గా మాట్లాడిన సీఎం

### గ్రామస్థాయికి అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

పూతలపట్టు/చిత్తూరు జిల్లా, మే 23:

చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని సంజీవని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. సంజీవని కార్యక్రమంలో పాల్గొనడానికి పూతలపట్టు వచ్చిన సీఎం చంద్రబాబు... తన పర్యటనలో భాగంగా పీహెచ్‌సీలో కొత్తగా ప్రవేశపెట్టిన సంజీవని డిజిటల్ వైద్య సేవల పనితీరును ల్యాబ్ డెమోల ద్వారా పరిశీలించారు. ఓ పేషెంట్ పీహెచ్సీకి వచ్చి... వైద్యం చేయించుకుని మందులు తీసుకెళ్లే ప్రక్రియను మొత్తం ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ ప్రక్రియలో భాగంగా సంజీవని ద్వారా టెక్నాలజీని అనుసంధానించి ఎలాంటి వైద్యం అందిస్తున్నారోననే అంశాన్ని సీఎం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్సీలోని వివిధ విభాగాలను సందర్శించి.. అక్కడున్న సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా సంజీవని ద్వారా రోగులకు తాము ఎలాంటి సేవలను అందిస్తున్నామనే అంశాన్ని ముఖ్యమంత్రికి ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది వివరించారు.

**ఓపీ నుంచి ఫార్మసీ వరకు ప్రతి విభాగాన్ని పరిశీలించిన సీఎం** : ఓ పేషెంట్ పీహెచ్సీకి వస్తే పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ డెస్క్ వద్ద చేపట్టే నమోదు ప్రక్రియను ముఖ్యమంత్రి పరిశీలించారు. పీసీసీ డెస్క్ ప్రతినిధి ఈ డిజిటల్ విధానాన్ని సీఎంకు వివరించారు. డిజిటల్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవలను మ్యాపింగ్ చేసే విధానాన్ని సీఎంకు వివరించారు. పీహెచ్‌సీ డ్యాష్ బోర్డులో ఉన్న మొత్తం రిజిస్ట్రేషన్లు, రోజువారీ కన్సల్టేషన్లు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ట్రాకింగ్ వంటి వాటిని సీఎం పరిశీలించి... వాటి పర్యవేక్షణ తీరుపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్ ను సీఎం సందర్శించారు. బీపీ, ఎత్తు, బరువు, టెంపరేచర్, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి వివరాలను డిజిటల్ పద్దతిలో నమోదు చేస్తున్న ప్రక్రియను సీఎం పరిశీలించారు. ఆ తర్వాత సంజీవని ప్లాట్‌ఫామ్ లో ఏఐ అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని సీఎం చంద్రబాబు వీక్షించారు. అక్కడ ఉన్న మెడికల్ ఆఫీసర్ రోగి పాత చరిత్రను సేకరించడం, నర్సులు రికార్డు చేసిన వైటల్స్‌ను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ వంటి ప్రక్రియలను లైవ్‌లో ముఖ్యమంత్రికి చూపించారు. ఈ ఏఐ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం తగ్గి, రోగులపై ఎక్కువ శ్రద్ధ పెట్టేందుకు వీలవుతుందని చంద్రబాబుకు డాక్టర్ వివరించారు. ఆ తర్వాత ఫార్మసీ విభాగాన్ని సీఎం సందర్శించారు. ఫార్మసీలో డిజిటల్ ప్రిస్క్రిప్షన్లను చూసి మందుల పంపిణీ చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా ఫార్మసీ విధుల్లో భాగంగా తాము రోజు వారీ చేసే పని విధానాన్ని సీఎంకు ఫార్మసీ సిబ్బంది వివరించారు. ఇక పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి సంజీవని ప్లాట్‌ఫామ్ ద్వారా కనెక్ట్ అయి... కుప్పం ఏరియా హాస్పిటల్, బెంగళూరులోని టాటాఎండీకి నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత రోగులకు సుదూర ప్రయాణాల భారం తప్పిస్తూ, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా అత్యాధునిక వైద్య నిపుణుల సేవలను నేరుగా స్థానిక పీహెచ్‌సీలకే చేరవేస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అత్యాధునిక సాంకేతికత విధానం గ్రామీణ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఈ సందర్భంగా సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలో వైద్యం తీసుకుంటున్న పలువురు పేషంట్లు.. వారి బంధువులతో సీఎం సంభాషించారు. టెక్నాలజీని అనుసంధానించి అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టు ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలతోపాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు ఎలా ఉందని వారి నుంచి సీఎం చంద్రబాబు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. తమకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు తమకు అందుతున్నాయని.. పథకాల అమలు బాగుందని వారు సీఎంకు వివరించారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించగలుగుతున్నామని లబ్దిదారులు సీఎంకు చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్







### సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ......

పెళ్లకూరు స్వర్ణసాగరం మే 23.

రాష్ట్ర ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా దర్బారు కార్యక్రమాన్ని అమలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చారని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. శనివారం పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై దాఖలైన 40 అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను, అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆమె వెల్లడించారు. పేదల అభివృద్ధి లక్ష్యంగా వచ్చే నెల 12 నుండి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్లు అర్హులైన నిరుపేదలందరూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**పెళ్లకూరు టిడిపి బలమైన కేడర్: మాజీ ఎంపీ నెలవల..** సూళ్లూరుపేట నియోజకవర్గం లోని పెళ్ళకూరు మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా ఉంటూ బలమైన కేడర్ గా కొనసాగుతున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని కంచుకోటగా తీర్చిదిద్దిన పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళిక బద్ధంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చెంబెడు పునపాక ఆర్ అండ్ బి రహదారి మార్గం పూర్తిగా ధ్వంసం అయిందని ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని యాగాన్ని బెన్ని విన్నవించారు. అలాగే గ్రీన్ ప్యానెల్ పరిశ్రమకు వెళ్లే కలప వాహనాలు కోసం ఏర్పాటుచేసిన రోడ్డు సంబంధించి పేదల భూములపై నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి దాడులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ పానల్ పరిశ్రమ తొట్టంబేడు మండలంలో ఉన్నందువల్ల పెళ్ళకూరు మండలానికి చెందిన నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం తీరుపై స్థానిక ప్రజా ప్రతినిధిరాలు ప్రత్యేక దృష్టి సారించి పేదలకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీల రాణి, నాయకులు మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, చైతన్య కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మదన్ నాయుడు, సత్యం రాజు, మాధవ రెడ్డి, వేణు రెడ్డి, లోకేష్ నాయుడు, గోపి, నరేంద్ర రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు విజయవంతం చేయాలి

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ మండలం

జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూచనలతో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాలతో సత్యవేడు తెలుగుదేశం పార్టీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి సమన్వయంతో ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న వర్చువల్ మహానాడు విజయవంతానికి మండల నాయకులు పనిచేయాలనీ టిడిపి మండల అధ్యక్షుడు చెంచు రామునాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సమావేశమై విస్తృతంగా చర్చించారు. పార్టీ బలోపేతం, మహానాడు ఏర్పాట్లు, కార్యకర్తల సమన్వయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ కన్వీనర్ ముని చంద్ర నాయుడులు సంయుక్తంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి తెలుగుదేశం కుటుంబ సభ్యుడు మహానాడు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

# "ఇటుక బట్టీలలో""బాల కార్మికులు" లేరన్న లేబర్ ఆఫీసర్ మరియు ఐసిడిఎస్ అధికారులు




తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే23

మండలంలోని వరిగొండ గ్రామంలో ఇటుక బట్టీలలో బాల కార్మికులు పనిచేస్తున్నారు అన్న సమాచారంతో శనివారం లేబర్ ఆఫీసర్ మరియు ఐసిడిఎస్ ఐసిపిఎస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు తమ విచారణలో బట్టీలలో బాల కార్మికులు లేరని లేబర్ ఆఫీసర్ రామారావు ఐ సి పి ఎస్ ఎన్ సి పి ఓ మంజుల ఐసిడిఎస్ సూపర్వైజర్ రంగమ్మ సోషల్ వర్కర్ పావని శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు

# ప్రభుత్వం ద్వారా నా కుటుంబాన్ని ఆదుకోండి



పూతలపట్టు స్వర్ణ సాగరం మే 23

ప్రభుత్వం ద్వారా నా కుటుంబాన్ని ఆదుకోండి అని పూతలపట్టు దళితవాడకు చెందిన సూర్య శనివారం విలేకరులతో మాట్లాడుతూ నా పేరు సూర్య కుమార్. నేను పూతలపట్టు నందు డిష్ కేబుల్ ఆపరేటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుంటిని నాకు ఇద్దరు పిల్లలు నాకు షుగర్ కారణంగా ఎడమ కాలు తీసివేయడం జరిగింది. ఈ క్రమంలో షుగర్ వల్ల కాలు తీసినప్పటినుండి నాకు జీవనం, కుటుంబ బాధ్యతలు భారంగా మారినాయి ఈ తరుణంలో ప్రభుత్వం కరుణించి మూడు చక్రాల మోటారు వాహనం మరియు వికలాంగుల పెన్షన్ ప్రతి నెల పెన్షన్ ఇప్పించాలని ప్రభుత్వాలను వేడుకుంటున్నాను. అన్నారు

# కనిగిరి మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ ప్రభుదాస్



కనిగిరి స్వర్ణ సాగరం మే 23

ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ మార్కాపురం జిల్లా ఇంచార్జ్ డాక్టర్ తాతపూడి ప్రభుదాస్ కనిగిరి మున్సిపల్ కమిషనర్ పి. శ్రీధర్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి,మౌలిక వసతుల మెరుగుదల,శుభ్రత కార్య క్రమాలు మరియు ప్రజలకు అందుతున్న సేవలపై కమిషనర్‌తో చర్చించారు.పట్టణంలో ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు,తాగునీటి సరఫరా,కాలువల శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ ప్రభుదాస్ కోరారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ కూడా స్పందిస్తూ పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు,సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వర ఆలయం పక్కనే చెత్త కుప్పలు.. భక్తుల ఆగ్రహం,

### జ్ఞాన ప్రసూనాంబ సదన్‌లో అధ్వాన పారిశుధ్యం

### దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న భక్తులు

### తక్షణ చర్యలు తీసుకోవాలని దేవస్థాన అధికారులకు విజ్ఞప్తి,




స్వర్ణసాగరం -శ్రీకాళహస్తి,

శ్రీకాళహస్తీశ్వర ఆలయం పక్కనే ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సదన్ వసతి గృహంలో పారిశుధ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచభూత లింగ క్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండగా, వారికి వసతి కల్పించే సదన్‌లో చెత్త కుప్పలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది.సదన్ వరండాలో చెత్త బుట్ట బోర్లాపడి ఉండగా, ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్ కప్పులు, ఆహార వ్యర్థాలు చెల్లాచెదురుగా కనిపిస్తున్నాయి. చీపురు, బకెట్లు పక్కనే ఉన్నప్పటికీ చెత్తను తొలగించే సిబ్బంది కనిపించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ దృశ్యాలను ఓ భక్తుడు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం వైరల్ అయింది.గుడికి వచ్చే భక్తులకు వసతి కల్పించే ప్రదేశంలోనే ఇలాంటి పరిస్థితులు ఉండటం ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విషయమని భక్తులు వాపోతున్నారు. చెత్త కుప్పల కారణంగా దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాహు-కేతు పూజలకు ప్రసిద్ధి చెందిన ఈ పుణ్యక్షేత్రంలో సదన్ నిర్వహణపై దేవస్థానం అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా పారిశుధ్య సమస్యలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపలేదని భక్తులు పేర్కొంటున్నారు.సదన్‌లో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రతి అంతస్తులో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, రోజుకు కనీసం రెండు సార్లు శుభ్రపరిచే సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించి పుణ్యక్షేత్ర ప్రతిష్ఠను కాపాడాలని కోరుతున్నారు.ఈ ఘటనపై దేవస్థానం ఈవో లేదా సదన్ మేనేజ్‌మెంట్ నుంచి ఇంకా అధికారిక స్పందన వెలువడలేదు.

# ఎస్పీ మెగా కౌన్సిలింగ్లో పాల్గొన్న రేణిగుంట డీఎస్పీ, సీఐ






**రేణిగుంట స్వర్ణ సాగరం మే 23**

జిల్లా కేంద్రమైన తిరుపతి పట్టణంలోని ఎస్పీ కార్యాలయం వద్ద తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎల్ సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆధ్వర్యంలో మెగా కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు, గంజాయి సేవించే వారు అమ్మే వారు, 14 సంవత్సరాల లోపు బాలికలపై అత్యాచారాలకు పాల్పడి పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వబడినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 485 మంది హాజరై కౌన్సిలింగ్ పొందినారు. కౌన్సిలింగ్ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇకపై ఎటువంటి నేర కార్యకలాపాలలో పాల్గొన్నా వారిపై కఠిన చర్యలు తీసుకోవడమేకాకుండా అవసరమైతే పి.డి యాక్ట్ నమోదు చేసి, రాష్ట్ర బహిష్కరణ చర్యలు కూడా చేపట్టబడతాయని హెచ్చరించినారు. రేణిగుంట సబ్ డివిజన్ తరపున మొత్తం 109 మంది హాజరైనారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వై. శ్రీనివాసరావు, రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్ జయ చంద్ర మరియు రేణిగుంట సబ్ డివిజన్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మహానాడు విజయవంతం చేయాలి

**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూచనలతో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాలతో సత్యవేడు తెలుగుదేశం పార్టీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి సమన్వయంతో ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న వర్చువల్ మహానాడు విజయవంతానికి మండల నాయకులు పనిచేయాలనీ టిడిపి మండల అధ్యక్షుడు చెంచు రామునాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సమావేశమై విస్తృతంగా చర్చించారు. పార్టీ బలోపేతం, మహానాడు ఏర్పాట్లు, కార్యకర్తల సమన్వయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ కన్వీనర్ ముని చంద్ర నాయుడులు సంయుక్తంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి తెలుగుదేశం కుటుంబ సభ్యుడు మహానాడు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

# కల్లూరు కొత్తపాలెంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

## ధర్మకర్త దువ్వూరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ



**స్వర్ణసాగరం వాకాడు**

మండల పరిధిలోని కల్లూరు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండవ శనివారం సందర్భంగా విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ కుమార్ అభిషేకాలు, పుష్పాలంకరణలు నిర్వహించారు. ధర్మకర్త దువ్వూరు జనార్దన్ రెడ్డి విద్యానగర్ లోని ఆయన స్వగృహం నుండి పాదయాత్ర ద్వారా ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతిష్ట అనంతరం రెండవ శనివారం సందర్భంగా ఆయన దీక్షతో పూజలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిత్య అన్నదానం నిర్వహించారు ఈ రోజు ఉభయకర్తగా ఆక్వా రైతు అశోక్ దంపతులు నిలిచారు. పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నూతన కరెంటు స్తంభం లైట్ ఏర్పాటు చేసిన మేఘాలదేవి



**కొయ్యలగూడెం స్వర్ణసాగరం**

పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం ఎస్సీ కాలనీ ప్రజలు వారి ప్రాంతంలో వీధిలైటు,కరెంటు స్తంభం లేని కారణంగా రాత్రిపూట వారు చాలా ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి వద్ద తమ సమస్యను తెలియజేయడం జరిగింది ,మేఘలాదేవి హుటాహుటిన పై అధికారులతో మాట్లాడి కొత్త కరెంట్ స్తంభంను వీధిలైట్ తో సహా వేయించడం జరిగింది, కాలనీవాసులు మేఘలాదేవి కి ధన్యవాదాలు తెలియజేశారు.మరియు కాలనీ వాసులు వారి ప్రాంతంలో డ్రైనేజీ పూడికలు తీయకపోవడం వల్ల మురుగు వాసన, దోమలు బెడద చాలా ఎక్కువగా ఉంది అని, కాలనీవాసులు అనారోగ్యం పాలు అవుతున్నారని మేఘలాదేవి కి తెలియజేశారు. మేఘలాదేవి పంచాయతీ కార్యదర్శి మరియు పై అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరిస్తాను అని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు.

# బీడీ కాలనీలో బిందె నీటికోసం బాటలు..!

## వారం రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా

## అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసుల మండిపాటు

## చుక్క నీటికోసం మహిళలు, వృద్ధుల అవస్థలు




**స్వర్ణసాగరం –తొట్టంబేడు,**

తొట్టంబేడు మండలంలోని బీడీ కాలనీలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత వారం రోజులుగా కాలనీలో మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేసవి ఎండలు మండిపోతున్న వేళ చుక్క నీటికోసం ప్రజలు బిందెలతో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీ వాసులు వాపోతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేదని ఆరోపిస్తున్నారు. "కార్యాలయానికి వచ్చి అడగండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించాల్సిన సమయంలో అధికారులు పట్టిం చుకోపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని బీడీ కాలనీలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామానికి దూరంగా నౌక నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేయాలి




## - తుపిలిపాలెం మత్స్యకారుల ఆవేదన

## మత్స్యకారులు, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి సమక్షంలో తహసీల్దార్ కు వినతిపత్రం అందచేత

**స్వర్ణసాగరం వాకాడు**

మండలంలోని తూపిలి పాలెం గ్రామ ప్రజలు తమ గ్రామ భవిష్యత్తును కాపాడుకోవాలనే ఉద్దేశంతో నౌక నిర్మాణ కేంద్రాన్ని గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకుని, గ్రామానికి దూరంగా నిర్మించాలన్న విషయం పై శనివారం బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మత్స్యకారులు కలిసి మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పెద్ద కాపులు మాట్లాడుతూ నౌక నిర్మాణ కేంద్రం గ్రామానికి చేరువగా వస్తే గ్రామంలోని త్రాగునీటి బోర్లు,స్మశానం, పశువులమేత భూములు,సహజ నివాస ప్రాంతాలు పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.గ్రామ ప్రజలు జీవనోపాదికి ఆదారితమైన మత్స్యసంపద దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు అందుకుగాను సర్వే నంబర్ 70 వరకు నౌక నిర్మాణాన్ని పరిమితం చేసి,గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ తూపిలి పాలెం గ్రామంలో సుమారు 3500 మంది నివసిస్తున్నారని, నౌక నిర్మాణం కారణంగా మౌలిక వసతులు కోల్పోయి భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యంగా తాగునీటి సదుపాయాలు, జీవనోపాధి కోల్పోవడం వలన ప్రమాదంలో పడే అవకాశం ఉందని మత్స్యకారులకు తమ వృత్తిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని సముద్రానికి వెళ్లే మార్గాలు మారిపోవడం, చేపల వేటకు ఆటంకాలు కలగడం వంటి సమస్యలు తలెత్తవచ్చని కనుక వారిపట్ల కొంచెం చొరవ చూపాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ స్పందిస్తూ, ఈ విషయాన్ని ఆర్డీవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దకాపు ఆర్కేటి మహేంద్ర, నడిమికాపు పాముంజి గోవిందయ్య, చిన్నకాపు వావిల గోవిందయ్యతో పాటు గ్రామ మత్స్యకారులు, స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బైక్ చోరీల కేసుల్లో ఘరానా దొంగ అరెస్ట్

## రూ.5 లక్షల విలువైన 5 మోటార్ సైకిళ్లు స్వాధీనం

**స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట మే 23 :**



తిరుపతి జిల్లా సూళ్లూరుపేట,తడ మరియు తిరుపతి టౌన్ ప్రాంతాల్లో వరుసగా మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న దొంగను సూళ్లూరుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు,నిందితుడు వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువ గల ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసు ఛేదనతో ఇటీవల ప్రాంతంలో పెరుగుతున్న బైక్ చోరీలపై పోలీసులు గట్టి దెబ్బ కొట్టినట్లైంది.సూళ్లూరుపేట సీఐ యం.మురళీకృష్ణ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాలు ఇటీవల సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ చోరీల ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ అనుమానితుల కదలికలపై నిఘా పెట్టడం జరిగింది,ఈ క్రమంలో మే 23 శనివారం ఉ 11:30 గంటల సమయంలో సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలిసి మన్నారుపోలూరులోని మన్నారు లేఅవుట్స్ ప్రాంతానికి చేరుకున్నారు.యువకుడు మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించినట్లు తెలిపారు.నిందితుడు తంజావూరు గణేష్ కుమార్ (19), తండ్రి సుబ్రహ్మణ్యం, కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, నెల్లూరు సిటీకి చెందిన వాడిగా పోలీసులు తెలిపారు. నిందితుడు సూళ్లూరుపేటలో రెండు,తడలో ఒకటి,తిరుపతి పట్టణంలో రెండు వాహనాలను అపహరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.నిందితుడు వద్ద నుంచి కేటీఎం బైక్,రెండు పల్సర్-150 బైక్‌లు,మరో పల్సర్-220,బైక్,హోండా యాక్టివా వాహనాన్ని పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నెల్లూరు పట్టణంలో గతంలో బైక్ చోరీ కేసులో జువెనైల్ హోమ్కు వెళ్లినట్లు పోలీసు తెలిపారు.బయటకు వచ్చిన తర్వాత కూడా తన నేరప్రవృత్తిని మార్చుకోకుండా చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించిన సూళ్లూరుపేట పోలీసులు.ఈ కేసులకు సంబంధించి పోలీసుల బిఎన్ఎస్ చట్టం 303(2) ప్రకారం కేసులు నమోదు చేశారు.మోటార్ సైకిల్ చోరీల కేసులను ఛేదించి నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట ఎస్సై జి.అజయ్ కుమార్, కె.కుప్పారావు,వి.కిరణ్‌బాబులకు రివార్డుల మంజూరు కొరకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడం జరుగుతుందని సూళ్లూరుపేట సిఐ ఎం.మురళీకృష్ణ తెలిపారు.

# ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసిన పొన్న యుగంధర్, పవన్

**తిరుపతి (శ్రీరంగరాజపురం) స్వర్ణసాగరం :23 మే :**

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను తిరుపతి ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గానికి చెందిన పొన్న యుగంధర్, మాజీ సర్పంచ్, కాపు నాయకుడు పవన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పనితీరుపై ఎమ్మెల్యే ప్రశంసం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గ్రామ గ్రామా నా కార్యకర్తలను బలోపేతం చేయాలని, పార్టీలో ఉన్న మాజీ నేతలను సమన్వయం చేసుకొని ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రతి పంచాయతీ లలో పాటు, వార్డు మెంబర్లకు పోటీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఇప్పటినుంచే సర్పంచ్ వార్డ్ మెంబర్లు,ఎంపీటీసీ తదితర పోటీలకు నాయకత్వం వహించే దిశగా అభ్యర్థులను ఎంపిక బాధ్యత తప్పనిసరన్నారు.



# మృణాల్, పూజా హెగ్డేలతో వరుణ్ ధావన్ రొమాన్స్.. 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' ట్రైలర్ విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్, స్టార్ హీరోయిన్లు మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ప్రముఖ సీనియర్ దర్శకుడు, వరుణ్ ధావన్ తండ్రి డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్ ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్ర ట్రైలర్ ఆసక్తికరమైన కోర్టు సీన్‌తో మొదలవుతుంది. వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ భార్యాభర్తలుగా నటిస్తుండగా, వరుణ్‌కు పిల్లలు కావాలని, కానీ మృణాల్ దానికి సిద్ధంగా లేకపోవడంతో వారు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతారు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లిన వరుణ్ ధావన్, అక్కడ పూజా హెగ్డేను కలుసుకుని ప్రేమలో పడతాడు. అయితే ఊహించని విధంగా అటు మృణాల్ ఠాకూర్, ఇటు పూజా హెగ్డే ఇద్దరూ ఒకేసారి ప్రెగ్నెంట్ కావడంతో కథలో పెద్ద ట్విస్ట్ వస్తుంది. ఇలా ఇద్దరు మహిళల మధ్య ఇరుక్కుపోయిన వరుణ్ ధావన్, ఆ నిజం బయటపడకుండా మేనేజ్ చేస్తూ ఎలాంటి అబద్ధాలు ఆడాడు, ఎలాంటి గందరగోళ పరిస్థితులను ఎదుర్కొన్నాడు అనేది ఈ సినిమా కథాంశం. ఇక ట్రైలర్‌తోనే మొత్తం కథను చెప్పేశాడు దర్శకుడు. వరుణ్, మృణాల్, పూజాలతో పాటు మనీష్ పాల్, చంకీ పాండే, జిమ్మీ షెర్గిల్, మౌని రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత రమేష్ తౌరానీ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'విక్రమ్' సినిమాతో మొదలైన ప్రయాణం..

## 40 ఏళ్ల మైలురాయిని దాటిన 'కింగ్'!

తెలుగు సినీ దిగ్గజం అక్కినేని నాగార్జున సినీ ప్రస్థానానికి నేటితో సరిగ్గా నలభై ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా భావోద్వేగభరితమైన పోస్ట్ షేర్ చేశారు. తన జీవితంలో మే 23వ తేదీ ఎప్పటికీ మర్చిపోలేని అత్యంత ప్రత్యేకమైన రోజు అని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం, అంటే 1986 మే 23న నాగార్జున హీరోగా పరిచయమైన తొలి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. బాలీవుడ్ సూపర్ హిట్ 'హీరో' చిత్రానికి రీమేక్‌గా దర్శకుడు మధుసూధనరావు తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించి, నాగార్జునకు భారీగా అభిమానులను సంపాదించి పెట్టింది. నాటి నుంచి నేటి వరకు ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమాభిమానాలే తనను ఇండస్ట్రీలో ఇంతకాలం నడిపించాయని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం తొలి చిత్రమే కాకుండా, తన కుటుంబానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'మనం' సినిమా కూడా ఇదే రోజున విడుదల కావడం విశేషమని నాగార్జున గుర్తుచేసుకున్నారు. తన తండ్రి, దివంగత నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గారి చివరి చిత్రమైన 'మనం' 2014 మే 23న విడుదలైంది. ఒకే స్క్రీన్‌పై నాన్నతో కలిసి, అలాగే తన కుమారులు నాగచైతన్య, అఖిల్‌లతో కలిసి నటించే అరుదైన అదృష్టం ఈ సినిమాతోనే దక్కిందని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. భవిష్యత్తులో కూడా మరిన్ని మే 23లను అభిమానుల మధ్య ఇలాగే ఘనంగా జరుపుకోవాలని ఆశిస్తున్నట్లు కింగ్ నాగార్జున ఆకాంక్షించారు. ఈ మైలురాయిని దాటిన నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున పలు విభిన్నమైన గెటప్పులలో కనిపించబోతున్నట్లు సమాచారం. గతంలో నాగార్జున కెరీర్‌లో ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచిన 'శివ', 'రక్షకుడు', మరియు 'కూలీ' చిత్రంలోని స్టైలిష్ సైమన్ వంటి పాత్రలను గుర్తుకు తెచ్చేలా ఈ 100వ సినిమా సరికొత్త హంగులతో ఉండబోతోందని దర్శకుడు ఇటీవల వెల్లడించారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై అలరిస్తూ, సరికొత్త ప్రయోగాలతో దూసుకుపోతున్న కింగ్ నాగార్జునకు సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



# మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్'గా వాసంతి జంట.. తట్టుకోలేకపోయిన నటరాజ్ మాస్టర్!



పక్కవారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని చాలా మందికి ఆశ.. అందులోనూ సెలబ్రిటీలు రియల్ లైఫ్‌లో ఎలా ఉంటారో చూడాలని చాలామంది తహతహలాడుతుంటారు. వారందరి కోసమే ఎప్పటికప్పుడు కొత్త కొత్త రియాలిటీ షోలు పుట్టుకొస్తున్నాయి. అలా ఎక్కువమందికి దగ్గరైన షో బిగ్‌బాస్. ఈసారి కొత్తగా 'మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్' అనే షో తీసుకొచ్చారు. ఇది మాటీవీతో పాటు హాట్‌స్టార్‌లోనూ ప్రసారమైంది.

**10 వారాల రియాలిటీ షో**

శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ షోలో అనిల్ రావిపూడి, రాధ, లయ జడ్జిలుగా వ్యవహరించారు. సీరియల్స్, బిగ్‌బాస్ ద్వారా ఫేమస్ అయిన సెలబ్రిటీలను కంటెస్టెంట్లుగా ఎంచుకున్నారు. అలా 10 సెలబ్రిటీ జంటలను 10 వారాలపాటు ఒక మాన్షన్‌లో ఉంచారు. వారే మహేశ్– సాంద్రా, జాను– భాను, వాసంతి కృష్ణన్– పవన్ కల్యాణ్, నటరాజ్ మాస్టర్– నీతూ, నూకరాజు– ఆసియా, సంధ్య– బ్రిట్టో, హరిత– హరీశ్, ప్రియాంక జైన్– శివకుమార్, అంజలి – పవన్, సోనియా– సిద్ధు.

**విజేతగా వాసంతి జోడీ**

మధ్యలో అభిమానిక– ఆమిర్ దంపతులు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ జంటల మధ్య ప్రేమ, నమ్మకం, సహనాన్ని పరీక్షించారు. ఎన్నో గేమ్స్ ఆడించారు. వాటన్నింటినీ దాటుకుని అందరికంటే బలమైన జంటగా నిలిచారు వాసంతి కృష్ణన్– పవన్ కల్యాణ్. ఈ జోడీ మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్ ట్రోఫీ గెలవడంతో పాటు రూ.15 లక్షల ప్రైజ్‌మనీ అందుకుంది. రెండో స్థానంలో నూకరాజు, మూడో స్థానంలో మహేశ్, ఐదో స్థానంలో జాను దంపతులు నిలిచారు. మొదటి నుంచి గెలుపు నాదే అని ఫిక్సయిన నటరాజ్ మాస్టర్ నాలుగో స్థానానికి పరిమితమవడంతో హర్టయి ఫినాలే నుంచి వెళ్లిపోయాడు.

# బికినీ ఫొటోలపై 'డ్రాగన్' హీరోయిన్ ఆగ్రహం



కన్నడ హీరోయిన్ రుక్మిణి వసంత్ పేరు చెప్పగానే సంప్రదాయ పాత్రలే గుర్తొస్తాయి. అలాంటిది ఈమె స్విమ్మింగ్ పూల్‌లో బికినీ ధరించి ఫొటోషూట్ చేసిందని చెప్పి ఓ వీడియోతో పాటు కొన్ని ఫొటోలు వైరల్ అయ్యాయి. నిజంగానే రుక్మిణి ఇలా చేసిందా అని అంతా అనుకున్నారు. ఇప్పుడు సదరు బికినీ పిక్స్‌పై ?స్వయంగా రుక్మిణినే క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. 'ఏఐ సాయంతో సృష్టించిన నా ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ కావడం నేను, నా టీమ్ గుర్తించాం. అవన్నీ ఫేక్. ఏఐతో తయారు చేశారని క్లారిటీ ఇస్తున్నాను. ఇలాంటివి క్రియేట్ చేయడం నిజంగా బాధ్యతారాహిత్యమే. అలానే మా వ్యక్తిగత గోప్యతని ఉల్లంఘించడమే అవుతుంది. దీన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. ఫొటోలని సృష్టించిన వాళ్లతో పాటు, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు మొదలుపెట్టాం. ఇలాంటి వాటిని పోస్ట్ చేయడం, షేర్ చేయడం లాంటివి మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని రుక్మిణి చెప్పుకొచ్చింది. రీసెంట్ టైంలో ఇలా జరగడం మరీ ఎక్కువైపోయింది. గతంలో పలువురు ఫొటోగ్రాఫర్లు.. వెనక వైపు నుంచి, అసభ్యకర యాంగిల్స్‌లో ఫొటోలు తీస్తున్నారని రుక్మిణితో పాటు పలువురు కన్నడ హీరోయిన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడిలా జరిగింది. యాంకర్ అనసూయకి కూడా ఇలానే జరగడంతో కేసు పెట్టింది. రుక్మిణి సినిమాల విషయానికొస్తే.. కన్నడలో చేసిన 'సప్త సాగర ఎల్లో దాచే' రెండు భాగాలతో పాటు 'కాంతార' సీక్వెల్ ఈమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'డ్రాగన్'లో నటిస్తోంది. వచ్చే ఏడాది జూన్ 11న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది.

Edited Printed Published & Owned by DAMA VIJAYAKUMAR. And Printed at VSR Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, A.P.
Published at VSR Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/26/A2367